## "చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను"

**( I will dwell in the house of the Lord for ever )**

ఇశ్రాయేలీయుల మధుర గాయకుడుగు రాజైన దావీదు, 3000 సం॥ క్రిందట ఇశ్రాయేలును 40 సం॥ పాలించెను. దావీదు అనగా ప్రియమైనవాడు అని అర్ధము. అతడు బెత్లేహేమీయుడైన యెష్షయి యొక్క ఎనిమిదవ కుమారుడు, దేవునికి యిష్టాను సారుడైన మనుష్యుడు. అతడు బహు శూరుడును రూపసియై యుండి తన తండ్రి గొఱ్ఱెలను మేపుచుండెను. దావీదు మహాశూరుడైన గొల్యాతును వడిసెలతోను, రాతితోను కొట్టి చంపి ఇశ్రాయేలీయులకు జయము కలుగజేసెను (1 సమూయేలు 17).

రాజైన దావీదు యొక్క జీవితము మరియు పాలన మనకు పరిశుద్ధగ్రంధములో 1 సమూయేలు, 2 సమూయేలు, 1రాజులు, 2 దినవృత్తాంతములు నందు మనము చూడగలము. అతడు ప్రేమ కలిగిన వ్యక్తి. రాజైన సౌలు నుండి తప్పించుకొని పోయిన కాలమందు అతని తల్లి దండ్రుల యొక్క సంరక్షణ చూచుకొనెను. (1సమూయేలు 22:3). అతడు ప్రేమించే భర్తగా నుండెను. (2 సమూయేలు 12:15-23). అతని కుమారుడైన అబ్షాలోము కొరకు ఎలుగెత్తి ఏడ్చెను (2సమూయేలు 13:31, 14:1, 18:33). ఒక మంచి తండ్రిగా గొప్పవాడైన సొలొమోనుకు సలహాదారుడై యుండెను.

**దావీదు యొక్క ఆసక్తి :**

రాజైన దావీదు యొక్క మంచి లక్షణం ఏమిటంటే అతడు ప్రతి విషయములోను దేవునికి కృతజ్ఞత కలిగి యుండెను. కీర్తనల గ్రంధము దావీదు రచించిన స్తోత్రగీతములు. దేవుని మందిరములో నివసించుటకు అపారమైన ఆశక్తి కలిగియుండెను. దేవుని యొక్క ఆలయం అనగా ప్రత్యక్ష గుడారము లేదా మందిరము. దేవుడు



మోషేకు యిలాగు ఆజ్ఞాపించెను, "నేను వారిలో నివసించునట్లు వారు నాకు పరిశుద్ధ స్థలమును నిర్మింపవలెను" (నిర్గమ 25:8).

**మందిరము ప్రాముఖ్యత :**

దేవుడు ఆ మందిరము నిర్మింపబడుటకు కావలసిన అన్ని వివరములు వారికి యిచ్చెను. ఆ మందిరము వారితో కూడ అరణ్య మార్గముంతటిలో ఉండెను. "ఇశ్రాయేలీయులు కానాను దేశము స్వాధీనపరచుకొనిన తరువాత వారందరు షిలోహునకు కూడి వచ్చి అక్కడ ప్రత్యక్ష గుడారము వేసిరి" (యెహోషువా 18:1). ప్రవక్తయైన సమూయేలు యొక్క కాలము వరకు అక్కడే ఉండెను (క్రీ.శ.50-500 సం॥) ఇశ్రాయేలీయులకును ఫిలిష్తీయులకు జరిగిన యుద్ధకాలమందు దేవుని యొక్క నిబంధన మందసము గుడారమునకు తీసుకొని రాబడినది (1 సమూయేలు 4:3,4). యెహోవా మందసము ఏడు నెలలు ఫిలిష్తీయుల దేశము అష్డోదు నందు ఉండెను. "అంతట కిర్యత్యారీము వారు వచ్చి యెహోవా మందసమును తీసుకొని పోయి కొండయందుండే అబీనాదాబు ఇంట చేర్చెను (1 సమూయేలు 7:12). దావీదు యెహోవా మందసమును తీసికొనివచ్చి గుడారము మధ్యను దాని కొరకు ఏర్పరచిన స్థలమున నుంచగా, దావీదు దహన బలులను సమాధాన బలులను యెహోవా సన్నిధిని అర్పించెను. (2సమూయేలు 6:17).

రాజైన సొలొమోను యెరూషలేములో దేవుని యొక్క గొప్ప ఆలయమును నిర్మించినంత వరకు అది అక్కడే ఉన్నది. దేవుని ఆలయం రాజైన సొలొమోను నిర్మించినప్పటికి దానికి అవసరమైన బంగారం, వెండి మొదలగువాటిని మరియు నమూనాను దావీదు సమ కూర్చెను. మరియు దావీదు యిలా చెప్పెను "మరియు నా దేవుని మందిరము మీద నాకు కలిగియున్న మక్కువ చేత నేను ఆ ప్రతిష్ఠితమైన మందిరము నిమిత్తము సంపాదించి యుంచిన వస్తువులు గాక, నా స్వంత మైన బంగారమును వెండిని

నా దేవుని మందిరము నిమిత్తము నేనిచ్చెదను" (1 దినవృత్తాంతములు 29:3).

కీర్తనకారుడు ఈ విధంగా పాడెను. "యెహోవా యొద్ద ఒక్క వరము అడిగితిని దానిని నేను వెదకు చున్నాను. యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవితకాల మంతయు నేను యెహోవా మందిరము లో నివసింపగోరుచున్నాను" (కీర్తనలు 27:4). "యెహోవా, నీ నివాసమందిర మును నీ తేజోమహిమ నిలుచు స్థలమును నేను ప్రేమించుచున్నాను" (కీర్తనలు 26:8). "దుప్పి నీటివాగుల కొరకు ఆశపడునట్లు దేవా, నీ కొరకు నా ప్రాణము ఆశపడుచున్నది (కీర్తన 42:1).

**తృష్ణ గల దావీదు :**

రాజైన దావీదు వేకువనే దేవుని ఉనికిని కోరుకున్నాడు, "దేవా, నా దేవుడవు నీవే, వేకువనే నిన్ను వెదుకుదును. నీళ్లు లేక యుండియున్న దేశమందు నా ప్రాణము నీ కొరకు తృష్ణగొనియున్నది" (కీర్తనలు 63:1,2). "సాయంకాలమున, ఉదయమున, మధ్యాహ్నమున నేను ధ్యానించుచు మొఱ్ఱపెట్టుకొందును" (కీర్తన 55:17). "అయినను పగటివేళ యెహోవా తన కృప కలుగ నాజ్ఞాపించును. రాత్రివేళ ఆయనను గూర్చిన కీర్తనయు నా జీవదాతయైన దేవుని గూర్చిన ప్రార్థనయు నాకు తోడుగా ఉండును" (క్రీనలు 42:8). "నీ యింటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించియున్నది. నన్ను నిందించిన వారి నిందలు నామీద పడి యున్నవి" (కీర్తనలు 69:9).

దావీదు దేవుని ఆలయములో నివసించుటకు గొప్ప ఆసక్తి కలిగి యుండెడివాడు "యెహోవా మందిరమునకు వెళ్లుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని" (కీర్తన 122:1). యెహోవా, నీ నివాసములు ఎంత రమ్యములు. యెహోవా మందిరావరణములను చూడవలెనని నా ప్రాణము ఎంతో ఆశపడుచున్నది. అది సొమ్మసిల్లు చున్నది. జీవము గల దేవుని దర్శించు



టకు నా హృదయమును, నా శరీరమును ఆనందముతో కేకలు వేయుచున్నవి. నీ బలిపీఠము నొద్దనే పిచ్చుకలకు నివాసము దొరికెను. పిల్లలు పెట్టుటకు వానకోవెలకు గూటి స్థలము దొరికెను. నీ మందిరము నందు నివసించు వారు ధన్యులు వారు నిత్యము నిన్ను స్తుతించుదురు. నీ వలన బలము నొందు మనుష్యులు ధన్యులు యాత్రచేయు మార్గములు వారికి అతి ప్రియములు. వారు బాకాలోయలోబడి వెళ్లుచు దానిని జలమయముగా చేయుదురు. తొలకరి వాన దానిని దీవెనలతో కప్పును. వారు నానాటికి బలాభివృద్ధి నొందుచు ప్రయాణము చేయుదురు. వారిలో ప్రతి వాడును సీయోనులో దేవుని సన్నిధిని కనబడును. దేవా, మాకేడెమా దృష్టించుము. నీవు అభిషేకించినవాని ముఖమును లక్షింపుము. నీ ఆవరణములో ఒక దినము గడుపుట వెయ్యి దినముల కంటె శ్రేష్ఠము. భక్తిహీనుల గుడారములో నివసించుట కంటె నా దేవుని మందిర ద్వారము నొంద్దనుండుట నా కిష్టము" (కీర్తనలు 84:1-10).

**ప్రతిష్ఠించుకొనిన జీవితము :**

ప్రవక్తయైన సమూయేలు తల్లియైన హన్నా అతడు పుట్టకమునుపే వాని బ్రదుకు దినములన్నిటను యెహోవాకు ప్రతిష్ఠించెను (1సమూయేలు 1:11,28). లూకా సువార్తలో కొంత మంది ప్రవక్తలను, భక్తిగల స్త్రీలను మనము చూడగలము. అన్నా, మిరియాము, దెబోరా, హుల్దా మొదలగువారు.

"మరియు ఆషేరు గోత్రికురాలును పనూయేలు కుమార్తెయునైన అన్న అను ఒక ప్రవక్త్రి యుండెను. ఆమె కన్యాత్వము మొదలు ఏడేండ్లు పెనిమిటితో సంసారము చేసి బహుకాలము గడిచినదై, యెనుబది నాలుగు సంవత్సరములు విధవరాలై యుండి దేవాలయము విడువక ఉపవాస ప్రార్థనలతో రేయింబగళ్ళు సేవ చేయుచుండెను" (లూకా 2:36,37).

భక్తిపరురాలైన ప్రవక్త్రియగు అన్నా కూడా దావీదువలె దేవుని

మందిరములో నివసించుటకు అపారమైన ఆశక్తి కలిగియుండెను. దావీదు వలె అన్నా కూడా దేవుని మందరిములో నివసించుటకు ఇష్ట పడెను. 1) ఆమె ఉపవాసముతో దేవునికి సేవ చేసెను. ఆమె ఏరకమైన సేవచేసేదో ఖచ్చితముగా వ్రాయబడ లేదు గాని ఆమె చేసిన పని చాలా ప్రేమ పూర్వకముగా చేసెడిది అని సూచించబడియున్నది. అది చాలా ఘనతగా ఎంచబడినది. సంఘ పరిచారకురాలగు ఫీబే (రోమా 16:1 ,2) యవొదియను, సుంటుకేసు వలె దేవుని మందిరములో సేవ చేయు చుండెను. 2) ఉపవాసము 3) ప్రార్ధనతో రేయింబగళ్ళు సేవచేయు చుండెను. 4) ఆమె ప్రభువుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచుండెను.

"నీ మందిరమందు నివసించు వారు ధన్యులు. వారు నిత్యము నిన్ను స్తుతించుదురు (కీర్తనలు 84:4). 5) ఆమె విమోచన కొరకు కనిపెట్టుచున్న వారందరితో ఆయనను గూర్చి మాట్లాడుచుండెను. ప్రతి తొలిచూలు మగపిల్ల ప్రభువుకు ప్రతిష్ఠ చేయబడ వలెనని ధర్మశాస్త్రమందు వ్రాయబడి నట్లు తల్లిదండ్రులు శిశువైన యేసును దేవాలయములోనికి తీసికొని వెళ్లిరి (లూకా 2:23). అప్పుడు అన్నా శిశు వైన యేసును చూచి యితడే మన రక్షకుడని ఆయన కొరకు కనిపెట్టు చున్న వారందరితో చెప్పెను.

ప్రవక్తి ఆమె జీవితం అంతా దేవుని సేవకు అంకితం చేసెను. ఆమె బ్రదుకు దినములన్నియు దేవుని మందిరములో నివసించినది. మన మందరము కూడా దేవుని మందిరము లో నివసించుటకు అపారమైన ఆసక్తి గలవారిగా ఉండవలెను.

సజీవుడైన దేవుని సంఘములో మనము బ్రదుకుదినములన్నియు దేవుని సేవచేయుచు, ప్రార్ధనలతోను విమోచకుని ప్రకటించుచు జీవించ వలెను.

మనము ఎల్లప్పుడు దేవుని మందిరములో నివాసము చేయుటకు ప్రయత్నము చేసెదము గాక! (కీర్తనలు 23:6).

**– కవితా గూటం**